www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 నవంబర్ 2025
5
అన్నమయ్య



18న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు స్థానిక భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్లో స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జోయెల్ విజయకుమార్ ఇండ్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా పలు అంశాలలో పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల యువతీ యువకులు (15-29 వయస్సు) పోటీలలో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు. కల్చరల్ ట్రాక్ జానపద నృత్యం, జానపద గేయం, కవిత్వం, కథారచన, పెయింటింగ్ డిక్లమేషన్ ఇన్నోవేషన్ ట్రాక్, సైన్స్ మేళా అంశాల్లో పాల్గొనదలచిన ఆసక్తిగల యువత https://tinyurl.com/dyfanmy 2025 లింకులో వారికి ప్రావీణ్యం గల వాటిలో వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఒక పోటీలో మాత్రమే పాల్గొన్నాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9849497045లో ఆఫీసు పనివేళలలో సంప్రదించాలన్నారు.



గొంతెండుతోంది..!

- కత్తివారిపల్లెలో తాగునీటి కష్టాలు
- రైతులు దయతలిస్తేనే గ్రామస్తులకు మంచినీరు
- మనిషి చనిపోయినా ఆరడుగుల స్థలం కరువు
- వెలగని వీధిదీపాలు
- గుంతలమయమైన రోడ్లు
- బస్సు లేక తిప్పలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడుస్తున్నా పలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతోంది. మండలంలోని మాలేపాడు పంచాయతీలోని కత్తివారిపల్లె అత్యంత దయనీయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. 85 కుటుంబాలున్న కత్తివారిపల్లెలో 350 మంది వరకూ జనాభా ఉన్నా, కనీస మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి ఓట్ల సమయంలో తప్ప మిగతా రోజుల్లో నాయకులు వెళ్లే పరిస్థితి లేకపోవడం, అధికారులు సైతం తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తుండడంతో గ్రామస్తుల ఆగచాట్లు అన్నీ ఇన్నీ కావు. గ్రామంలోని మంచినీటి బోరు ఎండిపోవడంతో ఆరు నెలలుగా గ్రామస్తులు మంచినీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న రైతుల బోర్లలో వచ్చే నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. రైతులు దయదలిస్తే తప్ప గ్రామస్తులకు మంచినీరు దొరికే పరిస్థితి లేదు. ఈ క్రమంలో గ్రామస్తులు నీటి కోసం గంటల తరబడి పొలాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు దయ తలిస్తే తమ పొలాల వద్ద ఒక్కో కుటుంబానికి ఒక బిందె నీళ్లు ఇస్తున్నారు. దీంతో రోజంతా గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కోసారి నీళ్లు దొరకని క్రమంలో రూ.800 ఖర్చు పెట్టి ట్యాంకర్ నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. గ్రామంలో వీధిలైట్లు లేక అంధకారం నెలకొందని వాపోతున్నారు. మబ్బు పడిందంటే సెల్ఫోన్ లైటు లేనిదే బయట అడుగు పెట్టలేమని గ్రామస్తులు చెబుతున్నారు. చీకటి పడితే ఒక్కరిలో బయటికి వచ్చే పరిస్థితి లేదని, మూగజీవాలకు మేత వేయాలన్నా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. విష పురుగుల బెడద ఎక్కువగా ఉంటున్నాయని, గ్రామంలో సొంతిళ్లు లేక ఇబ్బందిపడుతున్న, ఒక ఇంట్లో రెండు, మూడు కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నామంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమకు ఇల్లు మంజూరు చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా గ్రామానికి స్మశాన వాటిక లేకపోవడంతో ఎవరైనా చనిపోతే ఆరడుగుల స్థలం లేక అల్లాడిపోతున్నామన్నారు. తమ పొలాలు దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లి తమ వారిని ఖననం చేసుకుంటున్నామని, అధికారులకు విన్నవించినా శ్మశాన స్థలం కేటాయించలేకపోవడం బాధగా ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే ఆటోలు దిక్కుగా మారాయి. ఆటో నిర్వాహకులు అధిక మొత్తంలో డిమాండ్ చేస్తుండడంతో పిల్లలను బడికి కూడా పంపలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రతీ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ కింద మరుగుదొడ్లు నిర్మించారు. కత్తివారిపల్లెలో ఈ కార్యక్రమం కూడా జరగపోవడంతో ఇక్కడ మరుగుదొడ్లు లేవు. ఇప్పటికీ గ్రామస్తులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటికి వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మహిళలు, యువతులు స్నానం చేయాలంటే చాలా సమస్యగా ఉందని చెబుతున్నారు. రోడ్డు తీవ్రంగా కోసుకుపోయి కంకర తేలి గుంతలమయంగా మారిందని, ఇళ్లముందు నడవాలంటే భయపడే పరిస్థితి ఉందన్నారు. పిల్లలు, వృద్ధులు కింద పడి గాయాల పాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి



సాయంత్రం అయ్యిందంటే గ్రామం అంధకారం అయిపోతుంది. ఇంట్లోంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. పోల్స్ వేసిన లైట్లు లేవు. వీధి లైట్లు ఏర్పాటు చేసి చీకటి లేకుండా చూడాలి.

- నారాయణ, గ్రామస్తుడు, కత్తివారిపల్లె.

ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలి



గ్రామంలో ఆరు నెలలుగా నీటికి నరకయాతన పడుతున్నాం. రైతు దయతలిస్తే, గంటలతరబడి వేచి ఉంటే ఒక్క బిందె నీరు దొరుకుతుంది. వాటితో ఇంటిల్లిపాది ఎలా గడిపేది. వెంటనే అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ఆదుకోవాలి.

- వెంకటమ్మ, గ్రామస్తురాలు, కత్తివారిపల్లె.

పదిగురుకు ఒకే ఇంట్లో ఉంటున్నాం




మాకు ఏడు మంది బిడ్డలు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ఒక్కటే ఉంది. అస ఇంట్లోనే ఇంతమంది తలదాచుకుంటున్నాం. ఎన్నిసార్లు అర్జీలిచ్చినా ఇండ్లు మంజూరు చేయాలి. పెళ్లైన మా బిడ్డలకు ఇళ్లు ఇవ్వాలి.

- నీరుగట్టు గంగులమ్మ, గ్రామస్తురాలు, కత్తివారిపల్లె.

ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులతో వసతుల సమకూర్చాలి

కత్తివారిపల్లెలో తాగునీరు లేక జనం అల్లాడుతుంటే అధికారులు నిద్రపోతున్నారు. గ్రామంలో సగం జనం దళితులు. ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు వెచ్చించి రోడ్లు, కాలువలు వేయొచ్చు. వీధిలైట్లు ఏర్పాటు చేయవచ్చు. కానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెల లుగా నీళ్లు లేకుండా నరకం అనుభ విస్తుంటే స్పందించరా? ఎంపిడిఒ వెంట నే స్పందించి బోరు వేయించాలి. అంత వరకు ట్యాంకుల ద్వారా నీళ్లు ఇవ్వాలి. లేదంటే గ్రామస్తులతో కలిసి ఉద్యమిస్తాం.



- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్.

గ్రామంలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తాం

కత్తివారిపల్లె గ్రామంలో నీటి కోసం బోరు వేస్తే ఫెయిల్ అయ్యింది. మరో పాయింట్ చూసి బోరు వేస్తాం. గ్రామంలో పర్యటించి ఇతర సమస్యలను పరిష్కరిస్తాం.



- తాజ్ మస్రూర్, ఎంపిడిఒ, మదనపల్లె.

జిఎస్టి స్టేటస్ తనిఖీ చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

టిడిఎస్ చెల్లింపుల్లో తప్పనిసరిగా జిఎస్టి ఐఎన్ స్టేటస్ తనిఖీ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వస్తువులు, సేవల పన్ను చట్టం-2017 కింద పన్ను చెల్లింపుదారులకు చెల్లింపులు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రద్దు చేయబడిన పన్ను చెల్లింపుదారుల ఖాతాలకు టిడిఎస్ జమ చేయడం వల్ల భారీగా రెవెన్యూ నష్టం సంభవిస్తుండడంతో కలెక్టర్, వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ జి.సుమతి, రాయచోటి, మదనపల్లి అసిస్టెంట్ కమిషనర్లు ఎస్.సుమయ, చిరంజీవి అవగాహన కలిపించారు. టిడిఎస్ మినహాయించే ముందు, సంబంధిత కాంట్రాక్టర్ లేదా సరఫరాదారు జిఎస్టిఐఎన్ స్థితిని తప్పనిసరిగా తనిఖీ చేయాలని వారు ఉద్ఘాటించారు. జిఎస్టి ఐఎన్ 'యాక్టివ్' గా ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. జిఎస్టి రద్దు చేయబడిన పన్ను చెల్లింపుదారుల ఖాతాలకు టిడిఎస్ మొత్తాలను జమ చేయడం వల్ల ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయ నష్టం వాటిల్లుందని అధికారులు తెలిపారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్. నిధులను విడుదల చేసిన నేపథ్యంలో, వివిధ శాఖల అధికారులు యాక్టివ్గా ఉన్న పన్ను చెల్లింపుదారులకు మాత్రమే టిడిఎస్ జమ చేయాలని చెప్పారు. తద్వారా పన్ను ఏకకాలంలో వసూలు అయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పన్ను చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం, ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. సదస్సుకు వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన టిడిఎస్ డిడక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ఆదివాసీల ఆరాధ్యుడు బిర్సాముండా : డిఆర్ఒ



విద్యార్థికి షీల్డ్ను అందజేస్తున్న డిఆర్ఒ మధుసూదన్రావు

ప్రజాశక్తి-రాయచోటి

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బిర్సా ముండా అని డిఆర్ఒ మధుసూదన్రావు కొనియాడారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఆదివాసీల్లో తొలి విప్లవ వీరుడైన బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన జాతీయ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి బిర్సా ముండా, బాబా సాహెబ్ అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్, చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా జయంతి నవంబర్ 15న 'జన జాతీయ గౌరవ దివస్'గా నిర్వహించి వారిని స్మరించుకోవడం ఆనందదాయ కమన్నారు. ఆదివాసీల్లో విప్లవ భావాలను రగిలించిన తొలి వీరుడు బిర్సా ముండా అని కొనియాడారు. ప్రజలు ఎన్నుకున్న రాజ్యాన్ని స్థాపిద్దాం అనే నినాదాలతో ఆదివాసీలను తిరుగుబాటు వైపు నడిపించాలన్నారు. జార్ఖండ్ ప్రాంతంలో జన్మించిన ఈయన్ను ముండా తెగకు చెందిన ప్రజలు దైవంగా భావించి 'భగవాన్' అని పిలిచేవారని, ఆదివాసీల సాగుభూములపై విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారిపై పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సంతల్ తదితర తెగలవారు తమ హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను, పథకాలను రూపొందించిందని, వీటిని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకొని మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్గా భారత కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఈ గుర్తింపు ఆదివాసీలందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలను ఆదివాసి విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. బిర్సాముండా 150వ జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించామని చెప్పారు. మొక్కల పెంపకం, పుష్ప నివాళి సంబరాలు, ఓరి ట్యన్ ప్రోగ్రాం, ఐఇడి క్యాంపెయిన్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, సాంప్రదాయ గిరిజన నృత్య కార్యక్రమాలు, మోక్ పార్లమెంట్, తదితర కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం జిల్లా రెవెన్యూ అధికారి చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు, జిల్లాలోని గిరిజన సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఇగా బాధ్యతలు చేపట్టిన సోమశేఖర్రెడ్డి



ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : విద్యుత్ శాఖ ఎస్ఇగా తాడేపూడి సోమశేఖర్రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఎస్ఇగా నియమితులయ్యారు. బాధ్య తలు చేపట్టిన ఆయన్ను జిల్లాలోని అన్ని డివిజన్ల ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిఇలు, ఉద్యోగులు కార్మిక సంఘాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కార్యాలయంలో ఇఇ, డిఇలతో సమావేశమయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చూడడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో వినియోగదరులను సంతృప్తి పరిచేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఉద్యోగులకు ఎవరికి ఎలాంటి అవసరమున్నా తనతో సంప్రదించి సమస్యల పరిష్కారం దిశగా అడుగు వేయాలని కోరారు. కాలిపోయిన ట్రాన్స్ఫార్లను అమర్చడంలో నిర్లక్ష్యం తగదన్నారు. 33 కెవి, 11 కెవి అంతరాయాలను తగ్గించాలని కోరారు. సిఎండి ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని, డిస్కం లెవల్లో రాయచోటి సర్కిల్ను అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా ఉద్యోగులు పనిచేయాలని కోరారు.

అరాచకం!

ప్రజాదృష్టి

మదనపల్లి కేంద్రంగా సాగిన కిడ్నీ రాకెట్ వ్యవహారం సంచలనం రేపింది. సినిమాలో చూపించే తరహాలో విస్తుపోయేలా చేసింది. దేశంలోని మెట్రోపాలిటన్ సిటీల్లో కిడ్నీ రాకెట్లు నడుస్తాయనుకునే వాళ్లం. తృతీయశ్రేణి పట్టణంలో ఇంతటి అమానుష తతంగం నడుస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ఏమి చేస్తోందనే చర్చ నడుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించే కీలక అధికారే కిడ్నీ రాకెట్కు సూత్రధారి కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. చివరికి డబ్బుల ఎరకు కిడ్నీ ఇస్తానని వచ్చిన పేద మహిళ మృత్యువుకు గల కారణామిటో వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. పేదరికం కారణంగా చివరికి కిడ్నీలను సైతం అమ్ముకోవాల్సిన దుస్థితికి దాపురించడానికి కారణాలేమిటో ఆరా తీయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులు సొంత క్లినిక్కులు నడపడం నేరం. వ్యవస్థాగత నేరానికి ఎవరు కారకులో విధాన కర్తలు ఆలోచించాలి. మొన్న నంద్యాల జిల్లాలో ఓ మహిళ డెలవరీ సమయంలో తెగిన పాలోపియన్ నాళం కారణంగా బతికి ఉండి జీవచ్ఛవంగా మారడం, తాజాగా మదనపల్లిలో కిడ్నీ రాకెట్ వ్యవహారానికి ప్రభుత్వాస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పనిచేసే అధికారులే కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు జిల్లా ప్రభుత్వాస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల్లో విధులు నిర్వహించడానికి అవకాశం ఇవ్వకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా స్థాయి ఉన్నతాధికార స్థానాల్లో కీలకమైన వైద్యులు ఉండడం ద్వారా గుట్టుచప్పుడు గాకుండా ఇటువంటి తప్పుడు వ్యవహారాలు సాగిపోతున్నాయనే వాదనకు బలం చేకూరుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్నమండెం పర్యటన మొక్కుబడిగా సాగిపోయింది. నదుల అనుసంధానమే తన జీవితాశమని చెబుతున్న ముఖ్యమంత్రి అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం రిజర్వాయర్ను పూర్తి చేయక పోవడం వెనుక గల చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్, జిఎన్ఎస్ఎస్ కాల్వలకు లింకు కాల్వను ఏర్పాటు చేయడం ద్వారా శ్రీనివాసపురం రిజర్వాయర్కు నీటిని విడుదల చేయొచ్చు. అన్నమయ్య రిజర్వాయర్ నిర్మాణానికి కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయడమో, కొనసాగించడమో చేయకుండా కాలయాపన చేయడం ఎందుకో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. జిల్లాలో డిజిటల్ దొంగల ముఠాను అరెస్టు చేయడం ద్వారా ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడం శుభదాయకం. ఈడి, సిబిఐ, ఎన్ఐఎ, ఇన్కం ట్యాక్స్ అధికారుల పేర్లతో స్థానికులను ఫోన్ల ద్వారా బెదిరించడం, లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. అనుచిత బెదిరింపుల ద్వారా లక్షలాది రూపాయలు పొగొట్టుకుని లబోదిబోమని వాపోతున్న వారందరికీ స్వల్ప ఉపశమనం లభించిందనే చెప్పాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు : డిఎస్పి



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా నడిచిన కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి డిఎస్పి మహేంద్ర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని మదనపల్లి పట్టణం ఎస్బిఐ కాలనీ కేంద్రంగా గ్లోబల్ ఆసుపత్రి యజమాని, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్ఎస్) డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో 15 మందితో కూడిన బృందం కిడ్నీ రాకెట్లో ఉన్నట్లు నిర్ధారించామని పేర్కొన్నారు. వారిలో ఆరుగురిని నిందితులను శనివారం సాయంత్రం అరెస్టు చేశామన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లాలోని ఆనందపురం మండలం, బొడ్డపాల్యానికి చెందిన యమున (29)ని ఈ నెల 9న పథకం ప్రకారం కిడ్నీ రాకెట్లోని ముఠా సభ్యులు మదనపల్లి గ్లోబల్ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. అదే రోజే పతకం ప్రకారం డాక్టర్ల బృందం సిబ్బందితో కలిసి, యమునతో పాటు మరొకరికి కిడ్నీలను తొలగించి అమర్చారని చెప్పారు. ఒకరికి సక్సెస్ కాగా యమున ఆపరేషన్ వికటించి మృతి చెందిందని దర్యాప్తు తేలినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో డాక్టర్ ఆంజనేయులు, ఎ2 బెంగళూరుకు చెందిన ఓ ముద్దాయి డాక్టర్, మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని అపోలో డయాలసిస్ మేనేజర్ బాలరంగడు, పుట్టపర్తి జిల్లా కదిరి డయాలసిస్ మేనేజర్ మెహరాజ్, కిడ్నీ రాకెట్లో కీలక పాత్ర పోషించిన విశాఖపట్నంకు చెందిన పెళ్లి పద్మ, కాకర్ల సత్య, యమున ప్రియుడు సూరిబాబులను అరెస్టు చేయగా, బెంగళూరు చెందిన కిడ్నీ రాకెట్లో ప్రముఖ పాత్ర పోషించిన డాక్టర్ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితులు ఉన్నారని వారిని త్వరలోనే పక్కా ఆధారాలతో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బిటిఎ నాయకులు

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

దీర్ఘకాలికంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న పిఆర్సి, డిఎ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి మండలంలోని పలు పాఠశాలలను వారు సందర్శించి తమ సంఘ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆన్నారు. పిఆర్సి గడువు ముగిసి రెండు సంవత్సరాలైనా ఇప్పటి వరకు కమిషన్ను కూడా వేయక పోవడం, సరెండర్ లీవ్లు క్రెడిట్ కాకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక విషయాలు సమస్యల మీద దృష్టి సారించాల, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పరీక్షల విధానం ఉపాధ్యాయులకు విద్యార్థులకు పెనుభారంగా మారిందన్నారు. ఈ విధానాన్ని వెంటనే మార్చేసి పాత విధానంలో పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిటిఎ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్షులు రాయచోటి రవిశంకర్, కోశాధికారి గోపాలు దాస్ రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా ఉపాధ్యక్షులు పి.రవిశంకర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట పెన్షనర్ల సంఘం ఎన్నిక శనివారం ఎన్జిఒ కార్యా లయంలో ఏకగ్రీవమైంది. జిల్లా అధ్యక్షులు బి.వెంకటరమణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా పిచ్చయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా జి.వి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వరి, ఎస్.రామాంజనేయులు, వసంతరాయుడు, భాస్కర్ పంతులు, గౌరవాధ్యక్షులుగా కె.డి.వరప్రసాద్, కె.కృష్ణయ్య, కార్యదర్శి పి.ఎల్లయ్య, కోశాధికారి జి.వి.చలపతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సుబ్బరామయ్య, కె.నరసింహులు, సుశీలమ్మ, కార్యదర్శులుగా రమణ నాయుడు, జి.యానాదయ్య, వసంతకుమారి, ఎం.నారాయణ, జయ చంద్రారెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులుగా ఏసన్న, బాబు, కమిటీ సభ్యులుగా చౌడమ్మ, లక్ష్మీనరసయ్య, సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి పి.చిన్న రెడ్డన్న, జిల్లా అధ్యక్షులు బి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి వి.రెడ్డి కుమార్, ఆర్థిక కార్యదర్శి జయచంద్రారెడ్డి, తాలూకా అధ్యక్షులు చెంగల్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ డి.ఎ మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన పిఎఫ్, కమ్యూటేషన్, గ్రాటివిటీ, ఎంకేష్మెంట్ ఆఫ్ అర్నెల్ లీవ్ సకాలంలో మంజూరు చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



నూతనంగా ఎన్నికైన పెన్షనర్ల సంఘం నాయకులు



కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

'అన్నమాచార్య' దోపిడీపై విచారణ జరిపించాలి

- ధర్నాలో విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆర్థిక దోపిడీపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, పిడిఎస్యు జిల్లా నాయకులు నేతి నాగేశ్వర, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు పోలి శివకుమాం డిమాండ్ చేశారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ప్లేస్మెంట్ పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేలు వసూళ్లకు పాల్పడటంతో పాటు ఫీజురీయింబర్స్మెంట్ రూ.15 వేలు జమచేసుకుంటున్నారని ఆగ్రహించిన విద్యార్థులు శనివారం విద్యార్థి సంఘాలతో కలిసి కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ శ్రీనివాసరావు అనే ఉద్యోగి ప్లేస్మెంట్ కోసం తమ వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.15 వేలు వసూలు చేసి పరారయ్యాడని తెలిపారు. కళాశాల యాజమాన్యం బాధ్యత వహించకుండా ఫీజురీయింబర్స్మెంట్ నుంచి మరలా రూ.15 వేలు కత్తిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లేస్మెంట్ ఉద్యోగిగా నియమించబడ్డ శ్రీనివాసరావు విద్యార్థుల నుంచి రూ.కోటిన్నరకు పైగా వసూలు చేశారని, ఇప్పుడు యాజమాన్యం తమకు సంబంధం లేదని చెప్పడం విద్యార్థులను మోసగించడమేనన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు ఈ విషయంపై టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి చమర్తి జగన్మోహన్రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఫీజురీయింబర్స్మెంట్కు సంబంధం లేకుండా విద్యార్థులంతా కళాశాల యాజమాన్యానికి ఫీజులు కట్టామని, 2021-2025 బ్యాచ్కు చెందిన విద్యార్థుల క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేలు కళాశాల యాజమాన్యం వసూలు చేసి అడ్డగోలుగా వ్యవహరిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఆరోపించారు. చమర్తి మాట్లాడుతూ విద్యార్థులకు అండగా ఉంటానని, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

టిడిపి క్లస్టర్ ఇన్ఛార్జిగా వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

తెలుగుదేశం పార్టీ రాయచోటి మండల క్లస్టర్ ఇన్ఛార్జిగా మురికినాటి వెంకటసుబ్బారెడ్డిని నియమించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నమండెం మండలానికి వచ్చిన సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్రెడ్డి సమక్షంలో మురికినాటి వెంకటసుబ్బారెడ్డి ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలోనే మురికినాటి వెంకటసుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలను గుర్తించిన మంత్రి రాయచోటి మండల క్లస్టర్ ఇన్ఛార్జిగా నియమించారు. ఈయన గతంలో రాయచోటి మండల టిడిపి అధ్యక్షులుగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మండల క్లస్టర్ ఇన్ఛార్జిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర మంత్రి రాంప్రసాద్రెడ్డి, లక్ష్మీ ప్రసాద్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



మురుగుతో నిండిన రోడ్డు

అధ్వానంగా మేకలవానికాలువ రోడ్డు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణం, యర్రమరెడ్డిగుట్ట నుంచి మేకలవాని కాలువకు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద మురుగునీటి కాలువ లేని కారణంగా మురుగునీరు అస్తవ్యస్తగా పారుతుంది. ఈ దారిన మేకలవానికాలువ గ్రామం ప్రజలు నిత్యం పీలేరుకు రాకపోకలు సాగిస్తుంటారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని ఈ మురుగు నీటికి కాలవ నిర్మించి ఈ దారిన వెళ్లే ప్రజలకు కాస్త దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎన్ని సార్లు నెత్తి నోరు కొట్టుకుంటున్నా పంచాయతీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. సంబంధిత పంచాయతీ, రైల్వే అధికారులు ప్రజల అసౌకర్యాన్ని గుర్తించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



విద్యార్థులకు వ్యాయామంపై శిక్షణ ఇస్తున్న ఎన్ఎస్ఎస్ బృందం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు పిలుపు నిచ్చారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో కొర్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలెంటీర్ల ప్రత్యేక శిబిరంలో ఐదవ రోజుకు చేరింది. శనివారం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యోగా, వ్యాయమ తరగతులు ,స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ.నిశ్చల, డాక్టర్ బి.హరి మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ కె.వెంకట సతీష్, డాక్టర్ హరి వర ప్రసాద్, డాక్టర్ పి.శ్రీలత, డాక్టర్ ఆస్మాసిద్ధిఖా, ఫిజికల్ డైరెక్టర్ వై.రవిశంకర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

పుల్లంపేట : పుల్లంపేట గ్రామ పంచాయితీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పారిశుధ్యం అవగాహన కల్పించారు. చెత్తదిబ్బలను గుర్తించి వాటిని తొలగించారు. విద్యార్థులు హ్యాండ్ వాష్ కార్యక్రమం ద్వారా చేతులను శుభ్రపరిచే విధానాన్ని తెలియజేశారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని, మూత్ర విసర్జన ఎక్కడ పడితే అక్కడ చేయకూడదని తెలిపారు.మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, ఎఒ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇదినేష్, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోహర్ సమర్థవంతమైన అధికారి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పికెఎం-ఉడా సెక్రటరీ పి.ఆర్.మనోహర్ ఓ సమర్థవంతమైన అధికారి అని బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రి మాజీ డైరెక్టర్ కంచి కళ్యాణ్‌కుమార్‌రెడ్డి ప్రశం సించారు. ఇటీవల ఆయనకు పికెఎం-ఉడా సెక్రటరీగా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో శనివారం మదనపల్లి పట్టణంలోని పికెఎం-ఉడా కార్యాలయంలో వేణు గోపాల్‌తో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సంద ర్భంగా కళ్యాణ్‌కు మార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా ఆయన పంచాయతీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించారని పేర్కొన్నారు. అహర్నిశలు ప్రజాశ్రేయస్సుకు పనిచేసే పి.ఆర్.మనోహర్ ఉద్యోగరీత్యా మరింత ఉన్నత స్థితికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి డివైఇఒ లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా సమ్మిళిత విద్యాశాఖ అధికారి కొన్నిపాటి జనార్ధన తెలిపారు. శనివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో పీలేరు నియోజక వర్గం స్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రేమకుమారి, జడ్‌పి హైస్కూల్ హెచ్ఎం జయపాల్ రెడ్డి, అలింకో డాక్టర్లు శివాసిస్ పట్నాకర్, సాంకేతిక సహాయకులు శివప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కెవిపల్లి మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, ఎంఆర్ కిట్స్ మొదలగునవి అందచేయుటకు నిర్ధారణ శిబిరం నిర్వహించగా 64 మంది ఉచిత ఉపకరణాల నిర్ధారణ పూర్తి చేసుకున్నారని అన్నారు. సామాజిక సమ్మిళితం కోసం ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పించే అలవెన్సెస్, ఉపకార వేతనాలు, థెరపీ సర్వీసులు, ఉపకరణాల ఉచిత సరఫరాల పంపిణీ, పదవ తరగతి పరీక్షలలో వారికున్న మినహాయింపులు, స్క్రైబ్ సౌకర్యము అన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 'నా స్కూలు నాకు గర్వకారణం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ 10వ తరగతిలో అత్యధిక మార్కులతో సత్ఫలితాలు సాధించాలని అకలెక్టర్ నిశాంత్ కుమార్, డిఇఒ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యంల సందేశాన్ని ఈ సభలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు మురళీధర్ రాజు, అశోక్, నాగరాజు, స్కూల్ అసిస్టెంట్స్, (ప్రత్యేక విద్య), ఐఆర్‌పి, సిజివిలు ధరణిజ, సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, రెడ్డి ప్రసాద్, లక్ష్మీనరసమ్మ, విశ్వనాథ, మాధవి, నేతాజీ, విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- కలకడ

ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహు మతులు, ప్రశంసా పత్రాలు అందించినట్లు చెప్పారు. పోటీల్లో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొనగా వారందరికీ ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను ప్రదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న శ్రీధర్

వినియోగంలో లేని పెద్దచెరువు పంట కాలువ

- కాలువలో పారని నీరు
- ఏపుగా పెరిగిన గడ్డి,వ్యర్థాలతో నిండిన వైనం
- మరమ్మతులు చేసి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు కుషావతి ఇరిగేషన్ ప్రాజెక్టును 1982-83 సంవత్సరంలో నిర్మించారు. ఆ రిజర్వాయర్‌లో నుంచి గోరాన్ చెరువు పంచాయతీ కుమ్మరిపల్లి వద్ద ఉన్న గాలివీడు పెద్దచెరువుకు నీరు రావడానికి కాలువలు ఏర్పాటు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం నిర్మిం చిన కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. కాలువల వెంబడి ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి వ్యర్థాలతో నిండిపోయింది. ఒక్కసారైన నీరు ప్రవహించిన దాఖలాలే లేవని రైతులు చెబుతున్నారు. అరవీడు రిజర్వా యర్ నుంచి గాలివీడు పెద్ద చెరువు నీరు వస్తాయని ఎదురు చూస్తున్న రైతుల ఆశలు ఆవిరి అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తు_న్నారు. 42 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు ఆ కాలువ నుంచి నీరు ప్రవహించ లేదన్నారు. అరవీడు, మలసానివారిపల్లె వద్ద రైతులు వారి పొలాలలో ఉన్న కాలువను మూసివేశారు. కుమ్మరపల్లి వద్ద ఉన్న రైతులు కాలువను మూసివేసి కాలవపై చెత్త వ్యర్థపదార్థాలతో నింపారు. ప్రజలకు, రైతులు ఉపయోగపడే ఈ కాలువలకు మరమ్మతులు చేయించాలని కోరారు. కాలు వలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని అరవీడు కుషావతి రిజ ర్వాయర్ నుంచి గాలివీడు పెద్ద చెరువుకు నీరు తెప్పించడానికి అధికారులు కృషి చేయాలని ఆ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.



కాలువల వెంబడి ఏపుగా పెరిగిన గడ్డి

పరిశీలించిన చర్యలు తీసుకుంటాం

అరవీడు కుషావతి మైనర్ ఇరిగేషన్ నుంచి గాలివీడు పెద్ద చెరువు కాలవ నిర్మించిన విషయం తెలుసు. ఆ కాలవ ద్వారా నీరు రాకుండా పోవడం గానీ, కాలువను ఆక్రమించినట్లుగా సమాచారం తెలియదు. తమ సిబ్బందిని పంపి కాలువను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-ప్రశాంత్, ఇరిగేషన్ ఇఇ

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత : కలెక్టర్



లక్కిరెడ్డిపల్లి : మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యతని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్ర మంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెల మూడో శని వారం నిర్వహిస్తోందని, వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించు కుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛత పైన ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పిల్లల నుంచి పెద్దవారి వరకు స్వచ్ఛతను మన జీవితంలో భాగం చేయాలని ఉద్దేశంతో వ్యక్తిగత పరిశుభ్రత సమాజ పరిశుభ్రత పాటించే విధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని కాపా డడం, చెట్లు నాటే కార్యక్రమం ఇలా చాలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆడపిల్లలలో నెలసరి ప్రక్రియలలో జరిగే ఇబ్బందులను, ఆహార అలవాట్ల గురించి ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తెలియజేస్తారని అన్నారు. వైయస్సార్ సర్కిల్ వద్ద మానవహారం ఆకా రంలో నిలబడి స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎంబి షఫీ నాయక్, డిపిఒ రాధమ్మ, తహశీల్దార్ క్రాంతికుమార్, ఎంపిడిఒ రెడ్డయ్య, డిప్యూటీ ఎంవి డిఒ ఉషారాణి, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉద్యో గులు, విద్యార్థులు పాల్గొన్నారు.**నిమ్మనపల్లె :**పరిసరాలను ఎప్పటికప్పుడుశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిఎల్‌పిఒ నాగరాజా అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎంఇఒ పద్మావతి, టిడిపి నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నిమ్మనపల్లిలో సచివాలయ ఉద్యోగులు, జడ్‌పిహైస్కూల్ (తెలుగు) విద్యార్థులతో ర్యాలీ చేపట్టి అధికారుల చేత పరిసరాల శుభ్రత నిర్వహణపై ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ అధికారులు ప్రతి గ్రామంలోనూ ఇంటింటా చెత్త సేకరణను సేకరిస్తున్నారని, మురుగునీటి కాలువలను పారిశుధ్య కార్మికుల తరచూ శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు వారి పరిధిలోని ఓ పల్లెకు వెళ్లి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ ప్రక్రియను ఫోటో తీసి ఆన్ లైన్ లో పొందుపరచాలన్నారు. చెత్త నుంచి సంపదను సృష్టించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ పద్మావతి, ఎపిఎం మురళి, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ఉపాధ్యాయుల గోపాల్, పంచాయతీ కార్యదర్శి నాగరాజా, టిడిపి నాయకు లు రాజన్న, శ్రీపతి, నవీన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **వీరబల్లి :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని మట్లి పంచాయతీలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, డ్వాక్రా మహిళలు, వైద్య ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, అందరూ కలిసి గ్రామంలో ర్యాలీ జరపారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగార్జున చారి మాట్లాడుతూ ఎపిని దేశంలోనే అత్యంత పరిశు భ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టార న్నారు. కార్యక్ర మంలో పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, టిడిపి నాయకులు నాగభూ షణం, నాయు డు, అంగన్వాడి టీచర్లు, వైద్య ఆరోగ్య ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండలంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎఒ ప్రవీణ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. వ్యవసాయ ,ఉద్యాన సహాయకులు మహేష్‌రెడ్డి ప్రవీణ్, తేజశ్రీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి. మస్తాన్, సునీత, పాల్గొన్నారు.

మునగ సాగుతో ప్రజలకు జీవనోపాధి : పీడీ

ప్రజాశక్తి-వీరబల్లి

మునగ సాగు మంచి జీవనోపాధి అని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం ఒదివీడు యర్రం రాజుగారిపల్లెకు చెందిన గంగరాజు పొలంలో మునగ విత్తనాలు నాటు పనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ ఆకు ప్రోసెసింగ్ యూనిట్ మండల రైతు సమాఖ్య ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మునగ రైతుల నుంచి పచ్చి ఆకు కొనుగోలు చేసి పౌడర్ తయారుచేయడం జరుగుతుందన్నారు. మునగ పౌడర్ తో 100 రకాల ఉత్పత్తులు తయారై అమెరికా, జర్మనీ, ఇంగ్లాండ్ తదితర దేశాలకు ఎగుమతులు అవుతున్నాయని తెలిపారు. ప్రపంచ దేశాల్లో మునగ ఆహార ఉత్పత్తులకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. మునగ వ్యవసాయం పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చేయాలన్నారు. రైతులకు మునగ వ్యవసాయం ద్వారా ఒక ఎకరానికి సుమారు లక్షరూపాయలు ఆధాయం వస్తుందన్నారు .మునగ వ్యవసాయం చేసే రైతులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం వల్ల రెండు సంవత్సరాలకు రూ .1.17 లక్షలు వస్తుందన్నారు. కార్యక్రమంలో జీవనోపాదుల జిల్లా మేనేజర్ గంగార్జున, ఎపిఎం ఖాదర్‌వలి, సిసి గంగాధరం, యాంకర్ పర్సన్ అనిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతుసమాఖ్య సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది, విఒఎ పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న నాగేశ్వరరావు

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు నిలయాలు



మదనపల్లి : పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు నిలయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మదనపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి ఆధ్వర్యంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాలలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాల యంలోని పుస్తకాలు చదువుకొని సమాజంలో గొప్పగా ఎదగాలని సూచించారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలు ఉపయోగపడే అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. గ్రంథా లయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్ర మంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.ముని గోపాలకృష్ణ, శ్రీవిద్యా వికాస్ జూనియర్ కళాశాల కరెస్పాండెన్, ప్రిన్సిపల్ శివశంకర్ నాయుడు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయుడు రెడ్డెప్ప, టిడిపి నాయకులు శ్రీరామ సహదేవ నాయుడు, బీదం గురునాథ్ యాదవ్, బెల్లె రెడ్డి ప్రసాద్, మంచూరు గురు, గ్రంథాలయ సిబ్బంది జయమ్మ పాల్గొన్నారు.**కలకడ :**గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ తెలిపారు. మండల శాఖలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించిన తెలిపారు. గ్రంథాలయంలో ఉన్న నవలలు చిన్న పిల్లల కథల పుస్తకాలు పాఠ్య పుస్తకాలు కాంపిటీషన్ పుస్తకాలను ప్రదర్శించి విద్యార్థులకు చూపించినట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ప్రాథమిక పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయులు పద్మావతి పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధే ధ్యేయం

- పెండ్యాల విజయ్‌కుమార్
- ఆర్యవైశ్య సంఘం చరిత్రలో మొదటిసారి ఎన్నికలు

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

రైల్వేకోడూరు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న పెండ్యాల విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శ్రీవాసవికన్యకాపరమేశ్వరిదేవి నూతన ఆలయ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతి పదికన వైభవంగా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తా మని క్రమశిక్షణతో పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కోడూరు ఆర్యవైశ్య సంఘం చరిత్రలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న ఎన్నికలు ఆర్యవైశ్యులలో తీవ్ర ఉత్తంట భరితంగా ఉన్నాయి. ప్రధానంగా అధ్యక్ష ఎన్నికల్లో పెండ్యాల మల్లికార్జున కుమారుడు పెండ్యాల విజయ్ కుమార్, మరొక అభ్యర్థి కామి శెట్టి సత్యానా రాయణ ఇరువురు అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికలలో పెండ్యాల విజయ్‌కుమార్ తప్పక విజయం సాధిస్తారని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌కుమార్ వాసవిక్లబ్ ద్వారా ఆర్యవైశ్య సంఘంలోని నిరుపేదలకు దాతల సహకారంతో ఎంతో సహాయ సహకా రాలు అంది ంచాడని అలాంటి వ్యక్తి ఆర్య వైశ్య సంఘం అభివృద్ధికి ఎంతో అవసరం అని అధిక శాతం ఆర్యవైశ్యులు భావి స్తున్నారు. శనివారం సాయం కాలం ఐదు గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుంది ఆదివారం ఎన్నికలు ముమ్మరంగా జరగనున్నాయి. కార్యక్రమంలో పెండ్యాల విజయ్ కుమార్ వర్గం కలువ మురళి, భవనాసి మల్లి,సత్యం, జి.సుమన్,ఎం.శివ, వై హేమంత్, పొన్నూరు నిరంజన్, సి.అశోక్, కామిశెట్టి గోపి, జి.నర్సయ్య, సాయి, వి మల్లికార్జున, వి.సత్య, సోమ శేఖర్, కుమార్, పి.దశరథ, టి.సత్య, టి.ద్వారక, సి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్ మద్దతు దారులు



రోగులను పరామర్శిస్తున్న చమర్తి

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వైద్యులకు చమర్తి సూచించారు. సిబ్బంది వివరాలు, వైద్యుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఓపికి ఎంతమంది వస్తున్నారని ఆరా తీశారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని కోరారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని, డయాలసిస్ కేంద్రం, ఆసుపత్రిలో వసతులు బాగా ఉండాలని పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించి వారి బాగోగులు అడిగి తెలుస ుకున్నారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణంలోనే వైద్యులు, నాయకులతో కలిసి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-రాజంపేట

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ పేర్కొన్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జిఎంసి ప్రాంగణంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ సునీల్ మాట్లాడుతూ బెల్ట్ గ్రేడింగ్ లో 19 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో కూరాకు వెంకట్ వినయ్ కుమార్ రెడ్ బెల్ట్ సాధించగా మిగిలిన 18 మంది వివిధ గ్రేడుల్లో అర్హత సాధించారని తెలిపారు. తేక్వాండో ఒలంపిక్ క్రీడ కావడం చేత విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉద్యోగాలలో క్రీడా కోటా కింద మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ప్రోత్సహించి క్రీడల్లో రాణించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శి నరసింహ, సంయుక్త కార్యదర్శి మందా శివయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పట్టపగలు వస్త్ర దుకాణంలో చోరీ

- రూ.20 వేలతో పరారీ

ప్రజాశక్తి-గాలివీడు : మండల కేంద్రం గాలివీడు పట్టణంలో పట్టపగలే ఓ వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. బాధితుల వివరాల మేరకు.. గాలివీడు మెయిన్ రోడ్‌లో ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్ ఎదురుగా మోడం శ్రీనివాసులు తన సొంత ఇంటిలో వస్త్ర దుకాణాన్ని కొనసాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం బట్టల యజమాని లేని సందర్భంలో అతని భార్య పుష్పవతి ఉండగా గుర్తు తెలియని వక్తి కర్చీఫ్ కావాలని రూ.500లకు చిల్లర కావాలని అడిగారని తెలిపారు. క్యాష్ బాక్స్ బయటకు తీయగానే అందులోని రూ.20వేలు నగదును హుటాహుటిన తీసుకొని పరారయ్యాడని తెలిపారు. సిసి పుటేజీ తీసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వికలాంగుడు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లిలో చోటు చేసుకుంది. పట్టణం బసినికొండలో నివాసం ఉంటున్న లేట్ రామప్ప కుమారుడు శంకర (42) పుట్టుకతోనే వికలాంగుడు కావడంతో ఏ పని చేయలేక చెల్లెలు రమణమ్మ ఇంటి వద్ద ఉండేవాడు. శుక్రవారం సాయంత్రం పుంగ నూరు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న సాయిబాబా గుడి వద్దకు వెళ్లాడు. అక్కడ గేటు వద్ద నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమా దంలో శంకర అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సోదరుడు వేమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

- కేసు నమోదు చేయలేదని బంధువులు రోడ్డుపై బైఠాయింపు

- ఆపై కేసు నమోదు చేసిన పోలీసులు



వినీత్ కుమార్‌రాజు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-కలికిరి: యువకుడు అనుమానాస్పద మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మృతుడు వినీత్ కుమార్‌రాజు(26) అబు మొబైల్స్‌షాప్‌లో పనిచేస్తుండేవాడని తెలిపారు. శుక్రవారం అబు కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సాయంత్రం అందరికీ పార్టీ ఇస్తానని చెప్పడంతో సాయంత్రం నౌషాద్‌భాషా వాహనంలో మృతుడు వినీత్ కుమార్‌తో పాటు అబూబకర్, అహ్మద్, నరేష్ ఐదుగురు రాయచోటికి వెళ్లి అక్కడ మద్యం మద్యం సేవించి తిరిగి కలికిరికి వచ్చారని తెలిపారు. 12 గంటలు ప్రాంతం లో అబూబకర్, అహమ్మద్‌ను నౌషాద్ కలికిరి క్రాస్ రోడ్లో వదిలేసి సత్యపురంలో కొత్తగా నివాసమున్న వినీత్‌కుమార్‌ను సికామ్ డిగ్రీ కళాశాల ఎదురుగా , నరేష్‌ను తిమ్మారెడ్డి మాదిగపల్లె వద్ద వదిలేశాడని చెప్పారు. తిరిగి కలికిరి క్రాస్ రోడ్డుకు వేగంగా వస్తుండగా మద్యం మత్తులో రోడ్డుపైనే తిరుగుతున్న వినీత్‌ను ఢీ కొట్టడంతో అతను తీవ్ర గాయాలతో రోడ్డు ప్రక్కన పడి పోయాడని చెప్పారు. ప్రమాద స్థలం సమీపంలో ఉన్న ఇంట్లోకి గట్టి శబ్దం రావడంతో ధర్మతేజ అనే యువకుడు బయటకు వచ్చి రోడ్డుపై పడి ఉన్న వినీత్‌కు అతని స్నేహితుడి సహాయంతో పోలీసులకు సమాచారం అందించాడని తెలిపారు. రాత్రిలో పనిచేస్తున్న బీట్ కానిస్టేబుల్ ఇద్దరు సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న వినీత్‌కుమార్‌ను పరిశీలించిగా అప్పటికే చనిపోయినట్లు వారు నిర్ధారించారు. మృతుడి సెల్ ఫోన్ పగిలిపోవడంతో సిమ్ కార్డు వేరొక సెల్‌కు వేసి అందులో ఉన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయగా మృతుడు కలికిరి ఇందిరమ్మ కాలనీలో నివాసముండే పీలేరు ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ కుమారుడు వినీత్ కుమార్‌రాజుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం సిఐ అనిల్‌కుమార్ తన సిబ్బందితో ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు పడి ఉన్న స్థలాన్ని పరిశీలించారు. మృతుని గాయాలపై ఉన్నప్పుడు నీళ్లు అందించిన ధర్మ తేజను విచారించారు. అనంతరం మద్యం పార్టీ ఇచ్చిన అబు మొబైల్స్ యజమాని అబూబకర్ అతని స్నేహితులు అహ్మద్ నౌషాద్ , నరేష్‌ను అదుపులోకి తీసుకొని కలికిరి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అనుమానస్పద కేసు నమోదు చేస్తున్నామని పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత వైద్యుల నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ప్రమాదం కాదు..హత్య చేశారని తల్లి ఆవేదన

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాలేదని మృతుని తల్లిదండ్రులు, బంధువులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. వినీత్ కుమార్ ను కావాలని పతకం ప్రకారం పుట్టినరోజు పార్టీ పేరుతో హత్య చేసి చంపేశారని మృతుని తల్లి సుకన్య ఆరోపించారు.అబు మొబైల్స్ షాప్‌లో పని చేస్తున్నప్పుడు నౌషాద్ అలియాస్ బబ్లు తో ఏదో ఒక విషయమై గొడవ పడ్డాడని దాన్ని మనసులో పెట్టుకుని కక్ష పెంచుకొని పుట్టినరోజు పార్టీ పేరుతో మిత్రులందరూ అతనికి మద్యం తాపించి హత్య చేసి కొత్తగా నివాసం ఉంటున్న సత్యపురం లోని మా ఇంటి సమీపంలో పడవేసి వెళ్లిపోయారని పేర్కొన్నారు. తమ కొడుకును హత్య చేసి కిరాతకంగా చంపేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.